మట్టి మాఫియా.. ఇష్టారాజ్యం

- అల్లూరు, పాదర్తి ఇరిగేషన్ చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు
- మట్టి విక్రయించి రూ.కోట్లు బొగేనుకుంటున్న కూటమి నాయకులు
- నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా మౌనంగానే ఇరిగేషన్ అధికారులు
- ప్రశ్నార్థకంగా చెరువుల ఆయకట్టు భూముల సాగు
- గిరిజనుల ఉపాధిపైనా తీవ్ర ప్రభావం



వందల ట్రాక్టర్లతో అల్లూరు ఇరిగేషన్ చెరువులో మట్టిని అమ్ముకుంటున్న దృశ్యం

కొత్తపట్నం: ''అడవి పండింది.. కాకులు తిన్నాయి'' అన్న చందంగా మారింది కొత్తపట్నం మండలంలోని ఇరిగేషన్ చెరువుల పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మట్టి మాఫియా రెచ్చిపోతోంది. గడిచిన మూడు నెలలుగా కొందరు అక్రమార్కులు ఇరిగేషన్ చెరువుల్లో మట్టిని యథేచ్ఛగా తరలిస్తూ కోట్ల రూపాయలు తమ జేబుల్లో వేసుకున్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై తీవ్రంగా చర్చ నడుస్తున్నా అధికారులు మాత్రం ఏమీ తెలియనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

కొత్తపట్నం మండలంలో అల్లూరు గ్రామానికి చెందిన చాపాయి, చక్రాయి, తాళ్ల, వినాయక చెరువులు, పాదర్తి గ్రామ పరిధిలో ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. పాదర్తి చెరువుకు సుమారు వెయ్యి ఎకరాలు ఆయుకట్టు, అల్లూరు ఇరిగేషన్ చెరువు పరిధిలో సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. వీటి ద్వారా ఆయా గ్రామాల పరిధిలో వందలాది మందికి ఉపాధి లభిస్తోంది. చెరువు భూముల్లో గడ్డితో పశుపోషకులు, చిల్లచెట్లు కొట్టుకుని, చేప పిల్లలు పెంచుకుని గిరిజనులు ఉపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఇష్టారీతిగా మట్టి తవ్వకాలు చేపట్టడంతో ఏర్పడుతున్న భారీ గోతులు చెరువుల స్వరూపాన్నే మార్చేస్తున్నాయి. చిల్లచెట్లు ఎండిపోవడంతోపాటు పశువులకు మేత కూడా లభించని పరిస్థితి ఏర్పడుతోంది. మేతకు వెళ్లిన పశువులు ఆ గుంతల్లో పడి మరణించే ప్రమాదం ఉందని పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. రంగాయపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చెరువులో తవ్విన గుంతలో పడి మరణించాడు.



పాదర్తి ఇరిగేషన్ చెరువులో మట్టిని తీసి అమ్ముకున్న అక్రమార్కులు

నిబంధనలకు తూట్లు

ఇరిగేషన్ చెరువులో మట్టి తవ్వాలంటే తొలుత ఆ శాఖ అధికారులకు దరఖాస్తు చేయాలి. ఎన్ని క్యూబిక్ మీటర్ల పరిమాణంలో మట్టి కావాలో దరఖాస్తులో పొందుపరచాలి. ఒక్కో క్యూబిక్ మీటర్‌కు ప్రభుత్వం పేర్కొన్న మేర ఫీజు చెల్లించాలి. అప్పుడు ఇరిగేషన్ అధికారులు లోతు, వెడల్పు మార్కింగ్ ఇచ్చి వెళ్తారు. ఆ విధంగా చెరువులో మట్టిని తవ్వుకోవాల్సి ఉంటుంది. కానీ అల్లూరు, పాదర్తి గ్రామాల పరిధిలోని ఇరిగేషన్ చెరువుల్లో ఆ నిబంధనలేవీ పాటించడం లేదు. కూటమి పార్టీలకు చెందిన నాయకులు కొందరు ఇష్టమొచ్చినట్లు మట్టి తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిన ఇరిగేషన్ అధికారులు ఏమీ తెలియనట్టు నిద్ర నటిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రామాలు అభివృద్ధి చేసుకుందాం..

- మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ అంజమ్మ
- తాగు నీరు, విద్యుత్ సమస్యలపై ధ్వజమెత్తిన ప్రజాప్రతినిధులు



గృహ నిర్మాణ శాఖపై సమీక్ష చేస్తున్న ఎంపీపీ

నాగులుప్పలపాడు: పార్టీల కతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. చేకూరపాడు సర్పంచ్ రమేష్‌బాబు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుంచి ప్రతి సమావేశంలో తాగునీరు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. గ్రామ తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఒంగోలు మండలం త్రోవగుంట నుంచి పైప్‌లైన్ల ద్వారా రావాల్సిన వాటా తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారని, దీంతో గ్రామంలో తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే సమావేశం నాటికైనా పరిష్కరించాలని కోరారు. ఒమ్మెవరం సర్పంచ్ పాలపర్తి బాలకోటి మాట్లాడుతూ గ్రామంలో గుండ్లకమ్మ నుంచి పైప్‌లైన్ సక్రమంగా పనిచేయక ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీళ్లు ఎక్కే పరిస్థితి లేకపోవడంతో గ్రామంలో తాగునీటి కష్టాలు తప్పడం లేదన్నారు. కనీసం ఆర్‌ఓ ప్లాంట్ కూడా పనిచేయడం లేదన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. వ్యవసాయాధికారి వెంకట్రావు మాట్లాడుతూ రైతులు తప్పకుండా పంటలను ఈ–క్రాప్ చేయించుకోవాలని తెలిపారు. విపత్తులతో పంట నష్టపోయినప్పుడు నేరుగా పరిహారం రైతుల ఖాతాల్లోకి చేరుతుందన్నారు. హౌసింగ్ ఏఈ రాజేష్ మాట్లాడుతూ 2014–2019 మధ్య కాలంలో హౌసింగ్ సంబంధించి పెండింగ్ బిల్లులు ఇస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో మహాలక్ష్మి, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చీమకుర్తిలో బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

చీమకుర్తి: స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు వచ్చే నెల 2వ తేదీన చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు చీమకుర్తి జిల్లా పరిషత్ బాలికల హైస్కూలు పీడీ స్వరూపావాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో పోటీలను నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాలోని పలు మండలాల నుంచి దాదాపు 150 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాస్థాయి జట్టును ఈ పోటీల్లో ఎంపిక చేస్తారన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్‌లు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

ఎస్‌డీసీ ఝాన్సీకి ఘనంగా వీడ్కోలు



ఝాన్సీలక్ష్మిని సత్కరిస్తున్న అధికారులు

ఒంగోలు అర్బన్: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ)గా పనిచేస్తున్న కె.ఝాన్సీలక్ష్మి బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆమెను అధికారులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేసు, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, ఎస్‌డీసీలు సునీల్, సత్యనారాయణ, తహసీల్దార్లు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను ప్రోత్సహిస్తే చర్యలు

సంతనూతలపాడు: మండలంలో మద్యం దుకాణదారులు బెల్ట్ షాపులు ప్రోత్సహించినా, ఎమ్మార్పీ కన్నా అధిక రేట్లకు మద్యం విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అజయ్‌బాబు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో బుధవారం సాయంత్రం మద్యం దుకాణదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు సమావేశాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మద్యం దుకాణదారులు ఎక్సైజ్ శాఖ నిర్ణయించిన టైం ప్రకారమే షాపులు తెరిచి, క్లోజ్ చేయాలని ఆదేశించారు.

మత్తు బానిసలను గుర్తించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ డాక్టర్ ఫ్లోరిన్‌లైఫ్

ఒంగోలు సిటీ: విద్యార్థులను మత్తు బానిసలుగా గుర్తించినట్లయితే వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేసి వారిని కాపాడాలని, ఇది విద్యార్థుల బాధ్యత అని సైకాలజిస్ట్, జీజీహెచ్ డాక్టర్ ఫ్లోరిన్ లైఫ్, డాక్టర్ అయేషనూర్, యువజన సంక్షేమశాఖ మేనేజర్ శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. బుధవారం వల్లూరు సమీపంలోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల వినియోగం–వాటి నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. చెడు వ్యసనాలు అలవడే విధానం, వాటి వల్ల తలెత్తే ఇబ్బందులు, బయటపడే మార్గాలపై విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఏవీ భాస్కరరావు, కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎస్.సంపత్‌కుమార్, ఎన్.అనోహ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీపావళి.. అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: దీపావళి పండుగను అందరూ సంతోషంగా నిర్వహించుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆకాంక్షించారు. ఈ మేరకు బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో బాణసంచా తయారీ, విక్రయాల దుకాణాలు తప్పక లైసెన్సులను కలిగి ఉండాలని స్పష్టం చేశారు. బాణసంచా విక్రయదుకాణాల వద్ద తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. లైసెన్సులు లేకుండా టపాసులను నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి రోజున ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే ఫైర్ స్టేషన్, 101, పోలీసు డయల్ 100,112 లేదా పోలీసు వాట్సప్ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

సోక్‌పిట్‌ల నిర్మాణాలకు ప్రోత్సాహం

- డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

మద్దిపాడు: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాలంటే సోక్‌పిట్‌లకు ప్రోత్సాహం అందిద్దామని డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ అన్నారు. పంచాయతీ కార్యదర్శుల విధుల్లో ముఖ్యమైన తాగునీరు, పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. సాధారణంగా గ్రామాల్లో మురుగునీరు వెళ్లే కాలువల వద్దే మహిళలు గొడవలు పడుతుంటారని, అటువంటి సమస్యలను అధిగమించేందుకు సోక్‌పిట్‌ల నిర్మాణం సరైన నిర్ణయమని చెప్పారు. ప్రభుత్వం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా సోక్ పిట్ల నిర్మాణానికి పెద్ద పీట వేసిందని తెలిపారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలకు, రైతుల కోసం ఫాడర్ పాండ్స్ నిర్మాణం, క్యాటిల్ షెడ్‌ల నిర్మాణాలకు భారీగా ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. వీటితో గ్రామాల్లో పలువురికి ఉపయోగం ఉంటుందని, ఇటువంటి పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు గ్రామస్తులకు అవగాహన కల్పించి వారికి లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన గ్రామ కార్యదర్శులను కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు వారి గ్రామాల్లో జరుగుతున్న ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల వివరాలు గ్రామ కార్యదర్శుల నోటీసులో ఉంచాలన్నారు. గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి సోక్‌పిట్‌లు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. ఎంపీడీఓ వి.జ్యోతి, ఏపీడీ వెంకటస్వామి, ఈఓపీఆర్‌డీ రఘుబాబు, ఏపీఓ ధనంజయ, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం

మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులతో ఎంపీడీఓ వి.జ్యోతి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక పెన్షన్‌ల పంపిణీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆమె హెచ్చరించారు. సచివాలయంలోని సిబ్బంది అందరికీ పెన్షన్లు అందించే కార్యక్రమంలో డ్యూటీలు వేయాలని, అవసరమైతై అంగన్‌వాడీ వర్కర్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను తీసుకోవాలని ఆమె ఆదేశించారు. పెన్షన్ పంపిణీలో తలెత్తే సమస్యలను అధిగమించేందుకు ఆమె పలు సూచనలు చేశారు. చెత్తను సేకరించడం తరలించడం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ జరుగుతున్న తీరుపై ఆమె అసహనం వ్యక్తం చేశారు.

ఎంపీడీఓపై ఈఓఆర్‌డీ ఫిర్యాదు

మద్దిపాడు: స్థానిక ఎంపీడీఓగా పని చేసి ప్రస్తుతం మార్టూరు ఎంపీడీఓగా పని చేస్తున్న వై.శ్రీనివాసరావుపై ఈఓపీఆర్‌డీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆగస్టులో తాను విధులకు హాజరైనా కొర్రీలు వేశారని, సెప్టెంబర్ నెలలో ఆటెండెన్స్ రిజిస్టర్‌లో తన పేరు రాసి ఏ అంటూ ఇంగ్లిష్‌లో రాశారన్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా అటెండెన్స్ రిజిస్టర్ జనవరి నుంచి డిసెంబర్ వరకూ ఉంటుందని, ఎంపీడీఓ శ్రీనివాసరావు అగస్టులో కొత్త రిజిస్టర్ ఏర్పాటు చేసి అబ్‌స్కాండ్ అంటూ అటెండెన్స్‌లో నమోదు చేయడంతో సెప్టెంబర్ నెలకు తన జీతం మంజూరు చేయకుండా కొర్రీలు వేయడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఈఓఆర్‌డీ తెలిపారు. ఏఓ వద్ద ఉండాల్సిన అటెండెన్స్ రిజిస్టర్‌ను తన వద్ద ఉంచుకుని, తన ముందు మాత్రమే సంతకం చేయాలనడం, నిత్యం విధులకు హాజరవుతూ మండలంలో కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్న తనను గైర్హాజరైనట్లు చూపుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలకు చీరల పంపిణి



చీరలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

సంతనూతలపాడు: స్థానిక ఎస్టీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సేవా సంకల్పం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద వర్గాలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ట్రస్ట్ ఫౌండర్, ఎన్నారై పాతూరి సంపత్ తండ్రి గోవిందయ్య జ్ఞాపకార్థం 100 మందికి చీరలు పంపిణీ చేశారు. 250 మందికి పైగా పేదలకు అన్నదానం చేశారు. మాజీ జెడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ, వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, సెక్రటరీ చివుకుల రాంగోపాల్, ట్రస్ట్ గౌరవాధ్యక్షురాలు షేక్ హసీనా బేగం, ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, ట్రస్ట్ సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, వేమా కవిత, శీలం మల్లారెడ్డి, ఎస్. శ్రీనివాసరావు, కె.ఆంజనేయులు, తన్నీరు నాగేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం సునీత, అంగన్‌వాడీ టీచర్ రమణమ్మ, ఎస్టీ కాలనీ మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

మంగమూరు గ్రామసభకు 70 అర్జీలు

సంతనూతలపాడు: మండలంలోని మంగమూరులో బుధవారం జరిగిన రీ సర్వే రెవెన్యూ గ్రామసభకు రైతుల నుంచి వివిధ భూసమస్యలపై 70 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూములకు సంబంధించిన పెండింగ్లో ఉన్న సమస్యలను అర్జీల రూపంలో అందజేస్తే 45 రోజుల్లో పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ ఆదిలక్ష్మి వెల్లడించారు. రైతులు రీ సర్వే గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్‌ఐ పి.రామ్ తేజ, వీఆర్వో జి.సుధాకర్, సర్వేయర్ ఎం.మల్లేశ్వరి, పంచాయతీ కార్యదర్శి ఎన్.ప్రతాప్ కుమార్, మండల ఇన్‌చార్జి సర్వేయర్ ప్రవీణ్, నాయకులు, పలు గ్రామాల సర్వేయర్స్ ఎం.బ్రహ్మయ్య, రమణమ్మ, హరికృష్ణ, శివమోహన్, హిమాం, సాయికుమారి పాల్గొన్నారు.

ఘనంగా భరద్వాజ మాస్టర్ జయంత్యుత్సవాలు



భరద్వాజ మాస్టర్ రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: ఒంగోలులోని లాయరుపేట షిరిడీ సాయి బాబా మందిరంలో బుధవారం షిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టార్ 86వ జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం భరద్వాజ మాస్టర్ సమాధికి అభిషేకం, పూజా క్రతువుల అనంతరం విగ్రహాన్ని మందిర ప్రాంగణంలో ఊరేగించారు. దత్త మందిరం వద్ద అలంకరించిన వేదికపై పూజలు చేశారు. ఈ సందర్భంగా భరద్వాజ మాస్టర్ శిష్య బృందం పారాయణం చేసి, కోలాటం ప్రదర్శించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బెల్ట్ తీస్తే రూ.5 లక్షల ఫైన్

- రెండోసారి పట్టుబడితే లైసెన్స్ రద్దు
- ఎంఆర్‌పీని పక్కాగా అమలు చేయాల్సిందే
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్

చీమకుర్తి: బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్ మద్యం దుకాణాల యజమానులను హెచ్చరించారు. చీమకుర్తి సర్కిల్ సీఐ సుకన్యతో కలిసి బుధవారం చీమకుర్తి ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం దుకాణాల యజమానులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుకాణాల యజమానులనుద్దేశించి సూపరింటెండెంట్ మాట్లాడుతూ బెల్ట్‌షాపుల్లో దొరికిన మద్యం ఏ లైసెన్స్ షాపు నుంచి వచ్చిందో నిర్ధారణ అయితే ఆ షాపుపై మొదటి సారిగా రూ.5 లక్షల ఫైన్ విధిస్తామని, రెండోసారి కూడా పట్టుబడితే షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. మద్యం సీసాలపై ఎంఆర్‌పీని కచ్చితంగా అమలు చేయాల్సిందేనని, దుకాణాల్లో లూజ్ సేల్స్‌ను విక్రయించకూడదని, ప్రభుత్వం నిర్దేశించిన వేళలను పాటించాలని తెలిపారు. జిల్లాలోని 171 మద్యం దుకాణాలకు ఈనెల 14న లాటరీ ద్వారా షాపులను కేటాయించి వారికి 16న తాత్కాలిక లైసెన్స్‌లను అందించినట్లు తెలిపారు. వారికి త్వరలో పర్మినెంట్ లైసెన్స్‌లను అందిస్తామని ఖాజామొహిద్దీన్ వివరించారు. కార్యక్రమానికి చీమకుర్తి సర్కిల్ పరిధిలోని 16 మద్యం దుకాణాల యజమానులు హాజరయ్యారు.

మున్సిపల్ టీచర్ల పదోన్నతుల్లో రోస్టర్ విధానం పాటించాలి

- బీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకటరావు

ఒంగోలు సిటీ: ప్రకాశం జిల్లా పరిధిలో ప్రస్తుతం షెడ్యూల్ ప్రకటించిన మున్సిపల్ ఉపాధ్యాయులు పదోన్నతుల్లో మెరిట్ కం రోస్టర్ విధానం పాటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకటరావు కోరారు. బుధవారం పదోన్నతులపై బీటీఏ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్‌కి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ మెరిట్ కం రోస్టర్ విధానం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాల మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే గత 25 సంవత్సరాల నుంచి పదోన్నతుల ప్రక్రియ జరుగుతోందని అదే విధంగా మున్సిపల్ ఉపాధ్యాయులకు అమలు చేయాలని డీఈఓను కోరారు. జీవో 342 ప్రకారం ఎస్సీ,ఎస్టీ కేటగిరీకి చెందిన ఉపాధ్యాయులు స్టడీ లీవ్ కోసం దరఖాస్తు చేసి ఉన్నారని, నెల రోజులు దాటినప్పటికీ లీవ్ మంజూరు ఉత్తర్వులు ఇవ్వలేదని డీఈఓ దృష్టికి తెచ్చారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు అప్పగించరాదని, ప్రధానోపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడిన తర్వాతే పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని విన్నవించారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారాబత్తెన జాలరామయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జగన్నాథం ప్రసాదరావు, జిల్లా కార్యదర్శులు కొండమూరి కొండలరాయుడు, గాలిమోటు భాస్కరరావు, ఒంగోలు డివిజన్ అధ్యక్షుడు పల్లె తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు ఎదురు చూస్తున్న ప్రజలు

చీమకుర్తి: ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డీ హనీఫ్ అన్నారు. బుధవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి హనీఫ్ మాట్లాడుతూ ఉచిత ఇసుక అంటున్నారే తప్ప ఎక్కడా ఉచితంగా దొరకటం లేదని, దీంతో భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్దుబాటు పేరుతో ప్రజలపై ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం మోపుతుందని, మద్యం బెల్ట్ షాపులను విచ్చలవిడిగా ఏర్పాటు చేయటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గతంలో వచ్చిన 303 సీట్లు నుంచి 240 సీట్లకు పడిపోయినా కార్పొరేట్ విధానాలనే అమలు చేస్తోందన్నారు. అనంతరం మండల సీపీఎం సమావేశంలో మండల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని, డీఎంఎఫ్ నిధులతో మండలాన్ని అభివృద్ధి చేయాలని, చీమకుర్తిలో మైనింగ్ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. సీపీఎం జిల్లా, మండల స్థాయి నాయకులు పమిడి వెంకట్రావు, కాలం సుబ్బారావు, పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.